సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
సోమవారం । 1 । జనవరి । 2024

భూపాలపల్లి పట్టణం రెడ్డికాలనీలో నూతన సంవత్సర వేడుకలు



న్యూస్‌రీల్

సండే సందడి



ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ప్రైవేట్ వాహనాలలో మేడారానికి తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు, అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, చీర, సారె, పూలు, పండ్లు, ఎత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందరాజు, పగిడిద్దరాజులకు పూజలు చేశారు. భక్తుల రద్దీతో గద్దెల ప్రాంగణం సందడిగా మారింది. ఉదయం 8 గంటల నుంచి మొదలైన భక్తుల రాక మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. సుమారుగా 10వేల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. మొక్కుల అనంతరం భక్తులు మేడారం పరిసర ప్రాంతాల్లోని కంక వృక్షాల కింద, చెట్ల కింద విడిది చేసి వంటావార్పు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు. ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ వెంకన్న కుటుంబ సమేతంగా అమ్మవార్లను దర్శించుకున్నారు.

పోలీసుల బందోబస్తు

అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారనే ముందస్తు అంచనా మేరకు పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. పస్రా సీఐ శంకర్ పర్యవేక్షణలో తాడ్వాయి ఎస్సై ఓంకార్ యాదవ్‌తో పాటు మరో ముగ్గురు ఎస్సైలు, 50 మంది సిబ్బంది భక్తులకు సేవలందించారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక



ఏటూరునాగారం: రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఏటూరునాగారం స్పోర్ట్స్ క్రీడాకారులు ఎంపికైనట్లు స్పోర్ట్స్ క్లబ్ కోచ్ పర్వతాల కుమారస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు వరంగల్ జిల్లాలోని పైడిపల్లి స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించారని తెలిపారు. అండర్ 17 బాల బాలికల హ్యాండ్ బాల్ పోటీల్లో పి.కార్తీక్, జె.రాధిక, జె.సమ్మక్క పాల్గొని ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. వీరు నేడు, రేపు మహబూబ్‌నగర్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొననున్నట్లు కుమారస్వామి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ మదన్‌మోహన్, జిల్లా పీడీ, పీఈటీలు అభినందించారు.

సాగునీరు అందించేందుకు కృషి



ములుగు రూరల్: ములుగు ప్రాంత రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు ఆదివారం మంత్రి రంగారావుపల్లి సమీపంలోని దేవాదుల పంపు హౌస్ నుంచి జంగాలపల్లి, బంజరుపల్లి చెరువులకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ గత ప్రభుత్వం తలాపున గోదావరి ఉన్న ములుగు ప్రాంతానికి సాగు, తాగునీరు అందించలేక పోయిందని తెలిపారు. రామప్ప చెరువును రిజర్వాయర్ చేసి పక్క నియోజకవర్గాలకు సాగు నీరు తరలించారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి ములుగు నియోజకవర్గంలోని రైతులకు గోదావరి జలాలను అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భూపాలపల్లి పట్టణం అంబేద్కర్ సెంటర్‌లో అర్ధరాత్రి విధుల్లో పోలీసులు



డ్రగ్స్ నియంత్రణ చేస్తాం..



జిల్లాలో గడిచిన ఏడాదిలో ప్రతి ఒక్కరి సహకారంతో అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాం. నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో డ్రగ్స్ నియంత్రణకు పకడ్బందీగా పని చేస్తాం. డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతాం. సైబర్ క్రైం మోసాలపై ఇప్పటికే ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. దీనిని మరింత వేగవంతం చేస్తాం. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం. ప్రతీ ఒక్కరు సూచనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలి.

– కిరణ్‌ఖరే, ఎస్పీ

సీజనల్ వ్యాధులు వచ్చే మాసాలను గుర్తిస్తాం..



ప్రతీ ఏడాది ఒక్కో నెలలో ఒక్కో రకమైన సీజనల్ వ్యాధులు ప్రబలుతాయి. అలాంటి వ్యాధులు ముందస్తుగా అరికట్టాలనే ఆలోచనలో ఉన్నాం. ఇందుకు కొత్త సంవత్సరంలో జిల్లా, మండలస్థాయి టీంలను ఏర్పాటు చేస్తాం. వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అప్రమత్తంగా ఉంటాం. జాతీయ కార్యక్రమాలు విజయవంతం చేస్తాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులకు ప్రసవాలు చేసే విధంగా వైద్యాధికారులకు శిక్షణ కార్యక్రమాలు చేపడుతాం. పీహెచ్‌సీలను బలోపేతం చేస్తాం.

– డాక్టర్ చల్ల మధుసూదన్, డీఎంహెచ్‌ఓ

సివిల్స్‌కు ప్రిపేరవుతా..



కలెక్టర్ కావాలనే కోరికతో చిన్నప్పటి నుంచి కష్టపడి చదువుతున్నా. పదవ తరగతి నుంచి ఇప్పటివరకు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ముందుకెళ్తున్నా. గతేడాది సైతం మంచి మార్కులు తెచ్చుకున్నా. 2024 సంవత్సరంలో అత్యధిక మార్కులు తెచ్చుకొని డిగ్రీ పూర్తి చేస్తాను. డిగ్రీ పూర్తయిన వెంటనే సివిల్స్‌కు ప్రిపేర్ అవుతాను.

– వీణ, డిగ్రీ విద్యార్థిని, కాటారం

భూపాలపల్లి పట్టణం రామప్ప కాలనీలో సంబురాల్లో సింగరేణి కార్మిక కుటుంబాలు



కొత్త ఆశలు..

నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం

- ప్రజల మన్ననలు పొందేలా పనిచేస్తామంటున్న అధికారులు
- లక్ష్యాలు నెరవేరేలా యువత ప్లాన్

నూతన సంవత్సరాన్ని జిల్లా ప్రజలు కొంగొత్త ఆశలతో అర్ధరాత్రి 12 గంటలకు ఘనంగా స్వాగతం పలికారు. గతేడాది చేదు జ్ఞాపకాలను వదిలేసి.. కొత్త సంవత్సరంలోకి నూతన ఆలోచనలతో అడుగు పెట్టారు. 2023లో అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన అధికారులు.. ఈ ఏడాది కొత్త ప్రభుత్వంలో మరింత ప్రజల మన్ననలు పొందేలా పనిచేస్తామని అంటున్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా తమ పనితీరు ఉంటుందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే తమ ధ్యేయమని చెబుతున్నారు. కొలువులు కొట్టడమే లక్ష్యంగా యువత ఈ ఏడాదిని టార్గెట్‌గా నిర్ణయించుకుంది.

– భూపాలపల్లి అర్బన్/ భూపాలపల్లి రూరల్/ కాటారం/ టేకుమట్ల/ మొగుళ్లపల్లి

ప్రజల మన్ననలు పొందేలా సేవలందిస్తాం..



కొత్తగూడెం జిల్లాలో విధులు నిర్వర్తించిన సమయంలో గతేడాది జూలైలో కురిసిన భారీ వర్షాలతో భద్రాచలం పూర్తిగా నీటిలో మునిగింది. అక్కడి ప్రజలకు అందించిన సహాయక చర్యలు మరువలేనివి. గత ప్రభుత్వం గుర్తించి రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు అందించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు వచ్చిన తర్వాత జిల్లా అధికారుల సమష్టి కృషి, పట్టుదలతో అసెంబ్లీ ఎన్నికలను విజయవంతం చేశాం. ఈ ఏడాది కూడా జిల్లా ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను అందిస్తూ కార్యక్రమాలు చేపడుతాం. ప్రజలకు చిరకాలం గుర్తుండేలా సేవలందిస్తాం.

– వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్

ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేస్తాం..



ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పథకాలను ప్రజలకు వంద శాతం అందేవిధంగా కృషి చేస్తాం. అధికారుల సహకారంతో జిల్లా అభివృద్ధిలో నా వంతుగా ప్రధాన భూమిక ఉండే విధంగా కృషిచేస్తాను. మోరంచపల్లి గ్రామంలో వరదలు రావడం బాధాకరమైనప్పటికీ వరదల కారణంగా నిరాశ్రయులైన పేద ప్రజలకు గతేడాది నెల రోజులపాటు సేవలు చేయడం నాకు సంతృప్తి నిచ్చింది.

– విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ

వ్యవసాయరంగంలో యాంత్రీకరణకు కృషి..



వ్యవసాయ రంగంలో ఆధునీకరణకు కృషిచేస్తాం. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించే విధంగా రైతులకు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తాం. 2024లో వ్యవసాయ రంగాన్ని ముందుంచే విధంగా ప్రయత్నాలు చేస్తాం. ఈ ఏడాది కూడా ప్రభుత్వ ఆదేశానుసారం రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటాం.

– విజయ్‌భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి

ప్రభుత్వ ఉద్యోగ సాధనే లక్ష్యంగా..



10 సంవత్సరాలుగా లెక్చరర్‌గా పని చేస్తున్నా. గతంలో పలు ప్రభుత్వ ఉద్యోగాల కోసం పరీక్షలు రాశాను. దురదృష్టావశాత్తు ఉద్యోగం సాధించలేకపోయాను. ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కష్టపడి చదివి గతేడాది గ్రూప్–4 పరీక్ష రాశాను. ఇప్పటివరకు ఫలితాలు రాలేదు. గతేడాది స్ఫూర్తితో 2024లో నూతన లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకెళ్తా. ఏదేమైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించి తీరుతా..

– బొంతల సంతోష్, లెక్చరర్, కాటారం

స్కూల్ పిల్లలకు తోడ్పాటునందిస్తా..



వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన నేను బీటెక్ పూర్తి చేసి 2019లో చెన్నైలో సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగంలో చేరాను. 2021లో హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలో చేరా. మొదట్లో ఇతర ప్రాంతంలో ఉండడంతో సొంత ఊరిలో ఏమీ చేయలేక పోయాను. ప్రస్తుతం ఉద్యోగం, సంపాదన బాగానే ఉంది. 2024లో మా ఊరిలోని పాఠశాల విద్యార్థులకు తోడ్పాటు అందించాలని నిర్ణయించుకున్నా. తప్పకుండా చేస్తా.

– రాం సుమన్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, పంగిడిపల్లి, టేకుమట్ల

సామాజిక మార్పు కోసం..



ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఈ సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని అనుకుంటున్నాను. ఈ సంవత్సరంలో 200మంది వృద్ధులు, అనాథలకు బట్టలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా. సామాజిక మార్పు తీసుకువచ్చే రచనలు చేశాను. సంజానాక్షరం పేరుతో వివిధ పత్రికల్లో వచ్చిన నా కవితలను పుస్తకం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాను.

–చిరంజీవి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, మొగుళ్లపల్లి

అంబరాన్నంటిన సంబురాలు

కేకులు కట్‌చేసి న్యూ ఇయర్ వేడుకలు

- అర్ధరాత్రే వాకిళ్లలో ముగ్గులు
- కళకళలాడిన మద్యం దుకాణాలు
- అడుగడుగునా పోలీసుల తనిఖీలు



రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు



జిల్లా కేంద్రంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు

భూపాలపల్లి అర్బన్: నూతన సంవత్సర సంబురాలు జిల్లాకేంద్రంలో అంబరాన్ని తాకాయి. రాత్రి 12 గంటలకు కేకులు కట్‌చేసి కొత్త సంవత్సరానికి జిల్లా ప్రజలు స్వాగతం పలికారు. హ్యాపీ న్యూఇయర్ అంటూ ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు. పరస్పరం అలింగనం చేసుకుని సంతోషంతో నృత్యాలు చేశారు. కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ పాటలు పాడారు.

కేకులు, స్వీట్లు

చాలామంది ఇళ్లలో కేకులు కట్ చేశారు. స్వీట్లు పంచుకున్నారు. ఉదయం నుంచి అన్ని బేకరీలు, స్వీట్ షాపులు కొనుగోలుదారులతో పోటెత్తాయి. ఆఫర్లతో బేకరీలు, స్వీట్ షాపులు ఆకట్టుకున్నాయి.

ముత్యాల ముగ్గులు..

పట్టణంలో మహిళలు రాత్రి 10 గంటల నుంచి వాకిళ్లతో ముత్యాల ముగ్గులు వేశారు. తెల్లవారుజామున రెండు గంటల వరకు ముగ్గులతో వాకిళ్లను నింపేశారు. మహిళలు గుంపులుగా ఒకచోట చేరి అందమైన ముత్యాల ముగ్గులు వేశారు. కొన్ని కాలనీలు, సింగరేణి బ్లాక్‌లలో డీజే సౌండ్స్ ఏర్పాటు చేసుకుని డ్యాన్స్‌లతో హోరెత్తించారు.

మద్యం షాపుల ఎదుట..

వైన్స్, బార్ షాపులు, బెల్ట్ షాపుల వద్ద అర్ధరాత్రి వరకూ జనం బారులుదీరారు. దీంతో మద్యం దుకాణాల ఎదుట జాతర వాతావరణం నెలకొంది. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు శ్రావణ్‌కుమార్, సంధ్యారాణి, శ్రీలత, షాఖాన్ డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్, జయశంకర్ సెంటర్, గణేష్‌చౌక్, కాలనీల్లోని ప్రధాన కూడళ్ల వద్ద గొడవలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆలయంపై రాజకీయాలు వద్దు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని మంజూర్‌నగర్‌లో నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయంపై అధికారులు చేపడుతున్న చర్యలు మానుకోవాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆలయ ఆవరణలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోకకల్యాణార్థం నిర్మించిన ఆలయంపై నాయకులు రాజకీయం చేయడం సబబు కాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని స్థాయిల అధికారుల కనుసన్నల్లో ఆలయ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అధికారులు ఇచ్చిన నోటీసులను స్వాగతిస్తూ హైకోర్టులో అప్పీల్ వేయగా ఇటీవలే చట్టపరంగా ఎటువంటి అవాంతరాలు వద్దని తీర్పు వెలువరించిందన్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. రాజకీయపరమైన కోణాలను రాజకీయంగా ఎదుర్కోవాలి తప్ప ఆలయంపై ఎటువంటి రాజకీయాలు వద్దన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనార్దన్, నర్సింగరావు, పూర్ణచందర్‌రెడ్డి, రాజు, రవి, మురళి, రాజు, అశోక్, బలరాజు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీ

భూపాలపల్లి అర్బన్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో భూపాలపల్లి ఏరియాలో ఐఎన్‌టీయూసీ గెలిచిన సందర్భంగా ఆదివారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సంఘం బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జోగు బుచ్చయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీభక్తాంజనేయ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. ర్యాలీ అంబేడ్కర్ సెంటర్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు.

ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం

- నేడు భారీగా తరలిరానున్న భక్తులు

కాళేశ్వరం: జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం. ఈ క్షేత్రంలో ఒకే పానవట్టంపై శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి రెండు లింగాలు ఉండడం విశేషం. ఒకటి కాలుడు(యముడు), రెండవది ముక్తీశ్వరుడు(శివుడు). తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి ప్రతి సంవత్సరం న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవడానికి ఇక్కడకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. త్రివేణి సంగమ తీరంలో బోటింగ్ చేయడానికి వీలుంది. సంగమంలో బోటింగ్ షికారు చేయవచ్చు. కాళేశ్వరంలోనే ముక్తివనం పార్కు ఉంది. ఇందులో రకరకాల మొక్కలు, ట్రీహౌస్‌లు ఉన్నాయి. చిన్నారులు ఆహ్లాదబరితంగా చూడొచ్చు. కాళేశ్వరం నుంచి 8 కిలోమీటర్ల దూరం మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచలో బ్రిటీష్‌కాలం 1906 నాటి అద్దాలమేడ ఉంది. 68కిలోమీటర్ల దూరంలో గడ్చిరోలి జిల్లా కమలాపూర్‌లో ఏనుగుల పార్కు కూడా ఉంది. వీటిని సందర్శన చేయడానికి వీలుగా ఉంటుంది. ప్రస్తుతం బ్యారేజీ, పంపుహౌస్‌లకు అనుమతి లేదు. మంచిర్యాల జిల్లాకు 65 కిలోమీటర్లు, పెద్దపల్లి జిల్లాకు 90 కిలోమీటర్ల నుంచే కాకుండా ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి భక్తులు భారీగా రానున్నారు.



గర్భగుడిలో పూజలు చేస్తున్న భక్తులు



పంపుహౌస్ వద్ద పర్యాటకుల సందడి (ఫైల్)

ప్రతీ నెల దర్శించుకుంటాను..



నేను కుటుంబ సమేతంగా ప్రతీ నెల స్వామివార్లను దర్శించుకుంటాను. ప్రతి న్యూ ఇయర్‌కు మొక్కులు చెల్లించుకుంటాను. స్వామి వారిని దర్శించుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుంది.

– పి.సురేందర్, మంచిర్యాల

ఒకే పేజీలో క్యాలెండర్..

● విద్యార్థిని లాస్య ఘనత



లాస్య రూపొందించిన 2024 సంవత్సర క్యాలెండర్

విద్యారణ్యపురి: సంవత్సర క్యాలెండర్‌ను సాధారణంగా నెలకు ఒక పేజీ చొప్పున 12 పేజీలతో రూపొందిస్తుంటారు. అయితే హనుమకొండకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కూరపాటి సత్యప్రకాశ్‌రావు కూతురు లాస్య.. 2024 సంవత్సరానికి సంబంధించిన 12 నెలలు ఒకే పేజీలో రూపొందించడం విశేషం. హనుమకొండలోని ఓ ప్రైవేటు ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న లాస్య.. ఈ క్యాలెండర్‌లో పలు సామాజిక అంశాలతో కూడిన నినాదాలు కూడా పొందుపరిచారు. గతంలో తన తండ్రి కూడా ఇదే విధంగా రూపొందిస్తుండగా చూసి తాను 2024 సంవత్సర క్యాలెండర్‌ను ఒకేపేజీలో రూపొందించినట్లు లాస్య ఆదివారం తెలిపారు.



కూరపాటి లాస్య

మల్లన్న జాతరను విజయవంతం చేస్తాం..

పరిశుభ్రతకు ప్రాధాన్యం.. ప్లాస్టిక్ వినియోగం నిషేధించాలి | వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డల తల్లులకు ప్రత్యేక క్యూలైన్లు

- ఇక నుంచి ఏర్పాట్లన్నీ శాశ్వత ప్రాతిపదికనే చేపట్టాలి
- ఎలక్ట్రిక్ కార్ల ద్వారా భక్తులకు సేవలందించాలి
- దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- ఐనవోలు జాతరపై సమీక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సురేఖ, పక్కన కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు: సామాన్యులు సైతం ఆహ్లాదకర వాతావరణంలో శ్రీమల్లికార్జున స్వామివారిని దర్శించుకుని సురక్షితంగా ఇంటికి చేరుకునేలా ఏర్పాట్లు చేసి.. మల్లన్న జాతరను విజయవంతం చేస్తామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొద్దిరోజుల్లోనే మేడారం సమ్మక్క–సారలమ్మ, ఐనవోలు మల్లన్న జాతరలు జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నదని చెప్పారు. ఉమ్మడి జిల్లాలోనే పేరుగాంచిన ఈ అతిపెద్ద జాతరలను ఉమ్మడి జిల్లా మహిళా మంత్రులుగా తాను.. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కలిసి సక్సెస్ చేస్తామన్నారు. ఆదివారం ఐనవోలులోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయ అన్నదాన సత్రంలో 21 శాఖల జిల్లా ఉన్నతాధికారులతో జాతరపై కలెక్టర్ సిక్తాపట్నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి మంత్రి కొండా సురేఖతోపాటు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరయ్యారు. ముందుగా ఆలయ ఈఓ నాగేశ్వర్‌రావు గతేడాది జాతరలో జరిగిన లోటుపాట్లను వివరించి శాఖల వారీగా చేపట్టాల్సిన పనులను మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చి ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని చెప్పారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ(సీఎస్ఆర్)లో భాగంగా మెడికల్ అండ్ హెల్త్ క్యాంపులు నిర్వహించేలా ప్రైవేట్ ఆస్పత్రుల యజమానులను సంప్రదించాలని కలెక్టర్‌కు సూచించారు. వృద్ధులు, బాలింతలు, చంటిబిడ్డల తల్లుల విషయంలో చొరవ తీసుకుని ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి వలంటీర్ల సహకారంతో దర్శనం చేయించాలన్నారు. దూర ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చే భక్తులకు జీడబ్ల్యూఎంసీ అధికారులు బ్యాటరీ కార్ల ద్వారా సేవలంచాలని పేర్కొన్నారు. ఆలయం పడమరవైపు ఉన్న కుంట వద్ద స్విమ్మర్లు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని, రెప్పపాటు కూడా విద్యుత్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అగ్నిమాపక అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఆలయం వద్ద రెండు అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. నిరంతరం నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఆలయం చుట్టూ ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేసి తగినంత కాంతి ఉండేలా చూడాలన్నారు. భక్తుల రవాణాకు బస్సు సర్వీస్‌ల కొరత లేకుండా ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. మొబైల్ టాయిలెట్ల ఏర్పాటుతోపాటు శుభ్రంగా ఉండేలా ప్రత్యేక అధికారిని నియమించి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జాతరలో పనిచేసే సేవకులు, అధికారులు, మీడియాకు నాణ్యత గల ఆహారం అందించాల్సిన బాధ్యత ఈఓపై ఉందన్నారు. ముఖ్యంగా పోలీస్ శాఖ అందరితో సమన్వయం చేసుకుని సీసీ కెమెరాల పర్యవేక్షణలో ట్రాఫిక్ సమస్యలతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఆలయ పరిసర ప్రాంతాలకు మద్యం తరలకుండా ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. రోడ్లపై గుంతల పూడ్చి వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా పీఆర్, ఆర్అండ్‌బీ అధికారులు చూడాలని ఆదేశించారు. కోవిడ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో భక్తులు మాస్కులు ధరించడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా మెడికల్ అధికారులు చూడాలని చెప్పారు. ఇక మీదట జాతర ఏర్పాట్లు శాశ్వత ప్రాతిపదికన జరిగేలా చర్యలు తీసుకుంటానని సురేఖ స్పష్టం చేశారు. అంతకు ముందు మంత్రి స్వామి వారిని దర్శించుకోగా.. ప్రత్యేక పూజల అనంతరం పండితులు ఆశీర్వచనం, అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం జాతర వాల్‌పోస్టర్లు, బ్రోచర్లు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మల్లన్న జాతరను సక్సెస్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధిక, ఆర్డీఓ రమేష్, డీసీపీ రవీందర్, ఏసీపీ సతీష్‌బాబు, ఎండోమెంట్ డీసీ శ్రీకాంత్‌రావు, ఏసీ రామల సునీత, ఎంపీపీ మార్నేని మధుమతి, సర్పంచ్ జన్ను కుమారస్వామి, ఎంపీటీసీ కొత్తూరి కల్పన తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య



ప్రభాకర్ మృతదేహం

ఐనవోలు: పురుగుల మందు తాగి ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని వెంకటాపూర్‌లో జరిగింది. ఎస్సై వంగాల నవీన్‌కుమార్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన చింతం ప్రభాకర్ (60) ఐనవోలు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యుత్ సిబ్బంది ప్రభాకర్‌ను గుర్తించి వారి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ప్రభాకర్ తన వాహన మరమ్మతు నిమిత్తం ఐనవోలుకు చేరుకున్నాడు. మెకానిక్‌కు వాహనం అప్పగించి ఇప్పి మళ్లీ వస్తానని బయటకు వెళ్లాడు. కొంత సమయానికి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రభాకర్‌కు భార్య రమాదేవి, ఇద్దరు కొడుకులు రమేష్, రాజేష్, కూతురు ఉంది. కుమారులు ప్రభుత్వ ఉద్యోగులు. కూతురికి వివాహమైంది. కాగా, ప్రభాకర్‌కు ఎలాంటి ఇబ్బందులు లేవని, మద్యం మత్తులోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సిరాజుద్దీన్‌కు విశ్వకవి అవార్డు ప్రదానం

హన్మకొండ కల్చరల్ : హనుమకొండకు చెందిన కవి, వరల్డ్ పీస్ సొసైటీ వ్యవస్థాపకుడు మహ్మద్ సిరాజుద్దీన్‌కు నగరానికి చెందిన శ్రీసాయిమీరా కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో విశ్వకవి అవార్డును ప్రదానం చేశారు. ఆదివారం రాత్రి హనుమకొండ హౌసింగ్ బోర్డు కాలనీలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ సంగీత విద్వాంసులు ప్రొఫెసర్ తిరుపతయ్య.. సిరాజుద్దీన్‌కు విశ్వకవి అవార్డు ప్రదానం చేశారు. కొన్నేళ్లుగా కవితలు, విశ్వకవితలు రాస్తూ సాహితీసేవకు కృషి చేస్తున్నందుకు గానూ సిరాజుద్దీన్‌కు అవార్డు ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు కర్ణకంటి పోతానాచార్యులు, కార్యదర్శి నల్లా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీం వర్క్‌తోనే ఐహెచ్‌సీ విజయవంతం

● కేయూ వీసీ తాటికొండ రమేష్



మాట్లాడుతున్న వీసీ తాటికొండ రమేష్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో డిసెంబర్ 28నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన ఇండియన్‌హిస్టరీ కాంగ్రెస్ (ఐహెచ్‌సీ) టీం వర్క్‌తోనే విజయవంతమైందని వీసీ తాటికొండ రమేష్ అన్నారు. కేయూలో మూడు రోజులు నిర్వహించిన ఐహెచ్‌సీ విజయవంతంపై ఆదివారం క్యాంపస్‌లోని అతిథి గృహంలో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 1993 తరువాత మూడు దశాబ్దాలకు మళ్లీ ఐహెచ్‌సీ నిర్వహించడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమన్నారు. ఉద్యోగులు, అధ్యాపకుల సహకారంతోనే ఐహెచ్‌సీ సక్సెస్ అయిందన్నారు. చరిత్ర ద్వారానే సైన్స్ అభివృద్ధి చెందిందన్నారు. నేటి యువతరానికి చరిత్రను నిరంతరం అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని చెప్పడానికి ఈ ఐహెచ్‌సీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యంగా యువ పరిశోధకులకు ఇలాంటి సదస్సులు ఎంతో ప్రేరణ కలిగిస్తాయన్నారు. కేయూలో ఐహెచ్‌సీ నిర్వహించేందుకుగాను చరిత్ర విశ్రాంత ఆచార్యుడు ఇర్ఫాన్‌అబీ అందించిన సహకారం మరువలేనిదన్నారు. ఈ ఐహెచ్‌సీ నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడినప్పటికీ అధిగమించి విజయవంతం చేయగలిగామన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని సదస్సులు నిర్వహించాలన్నారు. ఐహెచ్‌సీ నిర్వహణకు వివిధ కమిటీలు కూడా సమిష్టిగా కృషి చేశారన్నారు. పత్రికా, మీడియారంగం కూడా కవరేజీ విస్తృతంగా ఇచ్చిందని అభినందించారు. కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ యూనివర్సిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ చేయూతనందించడంతో విశ్వవిద్యాలయానికి న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ వచ్చిందన్నారు. అదే స్ఫూర్తితో ఐహెచ్‌సీ నిర్వహించి సక్సెస్ అయ్యామన్నారు. ఈ సమావేశంలో ఐహెచ్‌సీ లోకల్ సెక్రటరీ, కేయూ హిస్టరీ విభాగం అధిపతి ఆచార్య టి మనోహర్ మాట్లాడారు. ఈ సమావేశంలో ఆచార్యులు పి మల్లారెడ్డి, బన్నఅయిలయ్య, వాసుదేవరెడ్డి, నర్సింహాచారి, వై వెంకయ్య, ఆర్ మల్లికార్జున్‌రెడ్డి, హిస్టరీ విభాగం రిటైర్డ్ ఆచార్యులు దయాకర్‌రావు, హరిప్రసాద్, డాక్టర్ రాధికారాణి, అడ్జెంట్ ఆచార్యుడు ఎస్ రామస్వామి పాల్గొన్నారు.

వర్ధన్నపేటలో దొంగనోట్ల కలకలం



వర్ధన్నపేటలో ప్రత్యక్షమైన దొంగ నోటు



వర్ధన్నపేట : వర్ధన్నపేటలో ఆదివారం దొంగనోట్లు కలకలం రేపాయి. పాన్ షాపులు, పెట్రోల్ బంకులు, కిరాణా దుకాణాల్లో గుర్తు తెలియని వ్యక్తులు రూ.100 నోట్లు ఇచ్చి పెట్రోల్, తదితర వస్తువులు కొనుగోలు చేస్తూ నోట్ల మార్పిడికి పాల్పడ్డారు. స్థానిక పాన్ షాపులో ఓ గుర్తు తెలియని వ్యక్తి రూ.100 నోటు ఇచ్చి పాన్ తీసుకుని మిగతా చిల్లర తీసుకున్నాడు. అదే విధంగా పెట్రోల్ బంక్‌లో సైతం మార్చుకోగా అనుమానం వచ్చి సంబంధిత నోట్లను పరిశీలించారు. అనుమానంతో స్థానిక బ్యాంకులోకి వెళ్లి వారికి వచ్చిన నోట్లను సిబ్బందికి చూపగా వాటిని పరిశీలించి అవి నకిలీ నోట్లుగా గుర్తించారు. దీంతో వ్యాపారులు లబోదిబోమంటున్నారు. పాన్ షాపుల వద్ద, కిరాణా షాపుల్లో అగంతకులు నోట్లను మార్చుకుంటున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సమాచారం అందుకున్న పోలీసులు దొంగ నోట్ల వ్యవహారంపై ఆరాతీస్తున్నారు. ఈఘటనపై స్పందించి వెంటనే దొంగ నోట్లు చలామణి చేస్తున్న వ్యక్తులను పట్టుకుని న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు, డీసీఎం ఢీ..

- ఒకరి మృతి, పలువురికి గాయాలు
- భాగిర్తిపేట కమాన్ శివారులో ఘటన



ప్రేమ్‌కుమార్(ఫైల్)



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన డీసీఎం, బస్సు

రేగొండ: ఆర్టీసీ బస్సు, డీసీఎం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం భాగిర్తిపేట కమాన్ శివారులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన ఈర్ల ప్రేమ్‌కుమార్(28) కరీంనగర్‌లో ఉంటూ ఫ్లిప్‌కార్ట్ సంస్థలో డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా ఆదివారం ఉదయం కరీంనగర్ నుంచి భూపాలపల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రేగొండ మండలం భాగిర్తిపేట కమాన్ శివారులో భూపాలపల్లి నుంచి పరకాల వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, డీసీఎం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ప్రేమ్‌కుమార్ క్యాబిన్‌లోనే ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందగా ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్లు వీరబోయిన రమేష్, మురళితో పాటు ఐదుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108లో క్షతగాత్రులను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న రేగొండ ఎస్సైలు శ్రీకాంత్‌రెడ్డి, తీగల మాధవ్ ఘటనా స్థలికి చేరుకుని ప్రేమ్‌కుమార్ మృతదేహాన్ని డీసీఎం క్యాబిన్ నుంచి బయటకు తీసి పరకాల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈఘటనపై మృతుడి సోదరుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పొగ మంచు, అతివేగమే కారణం?

పరకాల–భూపాలపల్లి ప్రధాన రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదానికి పొగ మంచు, అతివేగమే కారణమంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు. రహదారిపై రాకపోకలు తక్కువగా ఉండడంతో వాహనాల వేగం ఎక్కువగా ఉంటుందని, దీనికి తోడు పొగ మంచుతో దారి, ఎదురుగా వస్తున్న వాహనం కనిపించకపోవడంతో ప్రమాదం సంభవించినట్లు అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా, భాగిర్తిపేట కమాన్ శివారు ప్రమాదాలకు అడ్డగా మారుతోంది. ఏటా కమాన్ సమీపంలో భారీ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ కార్యవర్గ సమావేశం



మాట్లాడుతున్న సారంగపాణి

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలో మినీ స్టేడియంలో ఆదివారం రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొదిరిపాక సారంగపాణి మాట్లాడుతూ ఏటా క్రీడా పోటీలు నిర్వహించి వందల సంఖ్యలో క్రీడాకారుల ప్రతిభను వెలికి తీస్తున్నామన్నారు. అనంతరం 2024 సంవత్సరానికి సంబంధించి అథ్లెటిక్స్ మీట్స్‌లో నిర్వహించే క్రీడల నివేదికలను సిద్ధం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, చంద్రమౌళి, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి గంగిశెట్టి మనోజ్‌కుమార్, రాజు, కిరణ్, గోపాల్ మధు, సమ్మయ్య, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయాలి

● చర్చాగోష్టిలో పలువురి వక్తల అభిప్రాయం



చర్చాగోష్టిలో పాల్గొన్న విద్యావేత్తలు

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ విద్యాప్రగతి వేదిక ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని టీచర్స్‌కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో చర్చా గోష్ఠి నిర్వహించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ప్రజాకవి వల్లంపట్ల నాగేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈగోష్టిలో విద్యావేత్తలు గంటా రామిరెడ్డి, బాల్నె రామయ్య, పి రాంరెడ్డి, డాక్టర్ రతన్ సింగ్‌ఠాకూర్, మరో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బండా కాళీదాస్ మాట్లాడారు. పేద, వెనుకబడిన వర్గాల పిల్లల కోసం నాణ్యమైన విద్యనందించేలా ప్రభుత్వం కృషిచేయాలన్నారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉండాలని, బడిలేని ఊరు ఉండొద్దనే ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షిస్తూ మద్దతు పలికారు. మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేయబోతున్నట్లు ప్రకటించడాన్ని హర్షిస్తూ త్వరగా చేపట్టాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసదస్సులు, చైతన్యసభలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించి భాగస్వాములుచేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పూర్వప్రాథమిక విద్య (అంగన్‌వాడీ) ను ప్రభుత్వ పాఠశాలకు అనుసంధానం చేసి బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. తరగతిగదికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా నియామకాలు జరగాలని చర్చించారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయేతర సిబ్బందిని నియమించాలన్నారు.ఈ చర్చాగోష్టిలో సామాజిక కార్యకర్త, కుమ్మరగూడెం మాజీ సర్పంచ్ మల్లసూరి రమేష్,అవయవ శరీర దాన సంఘం అధ్యక్షుడు,కార్యదర్శులు కొన్‌రెడ్డి మల్లారెడ్డి, కారేటి శంకర్‌రావు, ఉపాధ్యాయులు బండి రవీందర్, కె సంపత్‌కుమార్, కె విజయరావు, వల్లంపట్ల శ్యాంసుందర్, బండారి రాజేందర్, మేడి సురేష్,మేకల సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అన్నపై తమ్ముడి దాడి.. కేసు నమోదు



దాడిలో గాయపడిన రవీందర్

నర్మెట : బోరుబావి వివాదంలో సొంత అన్నపై తమ్ముడు దాడి చేయగా తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని సూర్యబండా తండాలో ఆదివారం జరిగింది. తండా వాసులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తండాకు చెందిన భూక్యా సదన్‌లాల్‌కు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కాగా సదన్‌లాల్ తనకున్న వ్యవసాయ భూమిని, బోరు మోటరును కుమారులు రవీందర్, రమేశ్‌కు ఇవ్వడంతో దానిని ఉమ్మడిగా వాడుకుంటున్నారు. కాగా కొంత కాలంగా బోరుబావి విషయంలో అన్నదమ్ముల మధ్య పంచాయితీ నెలకొంది. ఈక్రమంలో ఆదివారం అన్నదమ్ముల మధ్య సయోధ్యకు పెద్దమనుషులు ప్రయత్నిస్తుండగా తమ్ముడు రమేశ్ పొలం వద్ద ఉన్న పారతో అన్న రవీందర్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రమేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

గంజాయి స్వాధీనం

ములుగు రూరల్ : మండలంలోని శ్రీనగర్ క్రాస్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ రంజిత్ కుమార్ తెలిపిన వివరాలు.. రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన మాలోత్ రవి, ఒడిశా రాష్ట్రం, మల్కన్‌గిరి జిల్లా నిమ్మలపల్లికి చెందిన దసరా సత్యబతితో కలిసి 6 కిలోల గంజాయిని వరంగల్‌కు తరలిస్తు పట్టుబడ్డారని తెలిపారు. పోలీసులు వెంబడించగా రవి తప్పించుకున్నాడు. ఒడిశా నుంచి సత్యబతి గంజాయిని తీసుకు వచ్చి ములుగు జిల్లా రాంచంద్రాపూర్‌కు చెందిన రవి తో కలిసి వ్యాపారం చేస్తున్నారు. కారుతో పాటు ఫోన్‌ను సీజ్ చేసి సత్యబతిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

కారును ఢీకొన్న బస్సు

● కాజీపేట చౌరస్తాలో ఘటన

కాజీపేట : కాజీపేట చౌరస్తాలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న పలువురు స్వల్పంగా గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. జనగామ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి ముందున్న కారును ఢీకొట్టడంతో ఆ కారు దాని ముందున్న మరో కారును వేగంగా ఢీకొట్టింది. దీంతో ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తమై వెంటనే బ్రేక్ వేయడంతో ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. రెండు కార్లు నుజ్జునుజ్జయ్యాయి. ముందు వెళ్తున్న కారు ఆకస్మాత్తుగా ఆగడంతో ప్రమాదం జరిగిందని ఆర్టీసీ సిబ్బంది చెబుతున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఆత్మహత్యకు కారకులైన నిందితుల అరెస్టు

కాజీపేట : కోడలిని మానసికంగా, శారీరకంగా హింసించి ఆత్మహత్య చేసుకునేలా ఉసిగొల్పిన అత్తింటి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ డేవిడ్ రాజ్ తెలిపారు. కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. విష్ణుపురి ప్రాంతానికి చెందిన ఉమైకుల్సుంను ఖమ్మం జిల్లాకు చెందిన యాకూబ్ పాషాకు ఇచ్చి వివాహం చేశారు. ఉమై కుల్సుం తండ్రి అనారోగ్యంతో మరణించగా ఆయన చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగం కావాలని అల్లుడు గొడవ చేయడంతో ఇవ్వడానికి సైతం ఒప్పుకున్నారు. కొద్దిరోజులకే రూ.30లక్షల అదనపు కట్నం, ఖమ్మంలో ఇల్లు కొనివ్వాలంటూ అత్త ఫాతిమా, మామ సందే సాహెబ్, భర్త యాకూబ్ పాషా వేధించడంతో తట్టుకోలేక తల్లిగారింటికి వచ్చి తనకు జరుగుతున్న అన్యాయాన్ని చెప్పుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐ రాజు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఏసీపీ వివరించారు.

ఇద్దరి రిమాండ్

చిట్యాల : మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్‌ను వేధించిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జంగిలి రమేష్ తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి మైనర్‌ను అదే గ్రామానికి చెందిన ఓర్సు ప్రశాంత్, సంపంగి సతీష్ కొంతకాలంగా వేధిస్తున్నారు. బాలికను వెంబడిస్తూ ఆమె ఫోన్ నంబర్ కావాలని వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో డిసెంబర్ 25వ తేదీన తీవ్రంగా వేధించడంతో బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. కాగా, ఎవరైనా మహిళలను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రమేష్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

వరంగల్ బస్‌స్టేషన్‌లో వ్యక్తి మృతి

వరంగల్ చౌరస్తా: వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో ఓ వ్యక్తి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా నర్సింహుల పేట మండలంలోని వంతడుపుల గ్రామానికి చెందిన బానోతు శ్రీనివాస్ (32) వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవిస్తున్నాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై కుటుంబీకులకు సమాచారం అందించగా శ్రీనివాస మృతదేహాన్ని స్వగ్రామం తరలించారు.